క్లుప్తంగా

వచ్చే నెల 1న భగవద్గీత శ్లోకాల పోటీలు

ఏలేశ్వరం: పట్టణంలో డిసెంబర్ 1వ తేదీన భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించనున్నట్టు విశ్వ హిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరీటీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కోనేటిబడి ఆవరణలో పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో నిర్వహించే పోటీల్లో కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్తిక వనసమారాధనలు

ప్రత్తిపాడు: కార్తిక మాసంలో రెండో ఆదివారం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో కార్తిక వనసమారాధనలు నిర్వహించారు. ప్రత్తిపాడులో వర్తక సంఘం ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వర్తక సంఘం సభ్యులు కార్తిక దామోదరునికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, వర్తక సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా చినశంకర్లపూడిలో జరిగిన వన సమారాధనలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు. సర్పంచ్ ఏపూరి రామారావు, ఎంపీటీసీ పిల్లా చిన్న తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

1,800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



పెదశంకర్లపూడిలో స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో సారా స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పరారయ్యారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ



ఏలేశ్వరంలో పడిపూజ చేస్తున్న అయ్యప్పస్వాములు

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం అయ్యప్ప స్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. స్వామియే శరణమయ్యప్ప నామస్మరణతో పట్టణం మార్మోగింది. గురుస్వాములు దండు వెంకటేశ్వరరావు, ఆచారి ఆధ్వర్యంలో సామంతుల భాస్కరరావు, వీరరాఘవమ్మ దంపతులు పడిపూజ నిర్వహించారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలధారులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజ చేశారు. కార్యక్రమంలో కోరాడ అప్పలస్వామి, సామంతుల రామన్న, అలమండ వీరరాఘవస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి సెంట్రల్ జోన్ చాంపియన్ షిప్ పోటీలు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం నుంచి జేఎన్టీయూకే సెంట్రల్ జోన్ మెన్, ఉమెన్ చాంపియన్ షిప్–2024 పోటీలు నిర్వహించనున్నట్టు యూనివర్సిటీ వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో జేఎన్టీయూకే పరిధిలోని వివిధ కళాశాలల నుంచి మెన్, ఉమెన్ అథ్లెటిక్స్, ఫిజికల్ డైరెక్టర్ల పాల్గొంటారన్నారు. వీరికి వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు.

సత్యదేవుని దర్శించిన ఇంటెలిజెన్స్ డీఐజీ



సత్యదేవుని సన్నిధిలో వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీఐజీ శ్రీప్రకాష్

అన్నవరం: రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీఐజీ శ్రీప్రకాష్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేసి సత్యదేవుని ప్రసాదాలను బహూకరించారు.

అంచుల్లో అపాయం

- కల్వర్టులు, బ్రిడ్జిలపై శిథిలమైన రక్షణ గోడలు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

కిర్లంపూడి: మండలంలోని బ్రిడ్జిలు, కల్వర్టులపై ఉన్న రక్షణ గోడలు శిథిలమయ్యాయి. వీటితో పాటు పలు చోట్ల రహదారుల అంచులు కోతకు గురికావడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. ఈ ప్రవాహం ధాటికి రోడ్లు, బ్రిడ్జిల రక్షణ గోడలు కూలిపోయాయి. రాజుపాలెం నుంచి వీరవరం, రామచంద్రపురం, తామరాడ, పాలెం, గోనేడ మీదుగా రామవరం వేళ్లే ప్రధాన రహదారి, చిల్లంగి, గెద్దనాపల్లి, భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం, తామరాడ రహదారుల్లో పలు కల్వర్టులపై ఉన్న రక్షణ గోడలు దెబ్బతిన్నారు. దీంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మలుపు.. ప్రమాదాల పిలుపు

వీరవరం గ్రామ శివారున గొర్రిఖండి కాలువపై ఉన్న రక్షణ గోడ ఇనుప చట్రం సగభాగం శిథిలమై కొట్టుకుపోయింది. రోడ్డు మలుపులో ఈ బ్రిడ్జి ఉండడంతో వాహన చోదకులు అదుపు తప్పి పడిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. తామరాడ-పాలెం మధ్యలో ఉన్న ఏలేరు కాలువ బ్రిడ్జి రక్షణ గోడలు శిథిలమయ్యాయి. నిత్యం బ్రిడ్జిపై నుంచి అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ముఖ్యంగా తామరాడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజ్ ఉండడంతో నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు కాలినడకన, సైకిళ్లపై ఈ బ్రిడ్జి మీదుగా ప్రయాణం సాగిస్తుంటారు. బ్రిడ్జిపై పలు చోట్ల రక్షణ గోడ కూలిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్.తిమ్మాపురంలో..

మండలంలోని ఎస్.తిమ్మాపురంలో పంట కాలువపై ఉన్న కల్వర్టు, రోడ్డు వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. చిన్నపిల్లలు అక్కడే ఆడుకుంటూ అనేక సార్లు కాలువలో పడిపోయారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తామరాడ ఏటిమొగ కాలువపై ఒక పక్క రక్షణ గోడ పూర్తిగా శిథిలమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలో శిథిలావస్థలో ఉన్న రక్షణ గోడల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఎస్.తిమ్మాపురంలో రక్షణ గోడ రెయిలింగ్ కొట్టుకుపోవడంతో ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి



వీరవరం శివారున గొర్రిఖండి కాలువలో కొట్టుకపోయిన రక్షణ గోడ రెయిలింగ్



తామరాడలో రక్షణ గోడలేకుండా ప్రమాదకరంగా ఉన్న ఏటిమొగ కాలువ బ్రిడ్జి

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం



రాజుపాలెం నుంచి గోనేడ, తామరాడ, పాలెం, సోమరాయణంపేట గ్రామాలకు నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తారు. వీరవరం, తామరాడ-పాలెం గ్రామాల్లో ఉన్న బ్రిడ్జిల రక్షణ గోడలు శిథిలమయ్యాయి. రాత్రులు ఈ మార్గంలో ప్రయాణాలు చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిలపై తాత్కాలిక మరమతులైనా చేపట్టాలి.

–అల్లు శివరామకృష్ణ, ఎంపీటీసీ, గోనేడ

మరమ్మతులకు నిధుల మంజూరు

తామరాడ-పాలెం గ్రామాల మధ్య ఏలేరు కాలువపై ఉన్న బ్రిడ్జి మినహా రాజుపాలెం నుంచి రామవరం వరకు ఉన్న కల్వర్టులు, బ్రిడ్జిల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులను ప్రారంభిస్తాం. గెద్దనాపల్లి నుంచి తామరాడ రహదారిలో పాడైపోయిన కల్వర్టులను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

– వెంకటేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఇంజినీర్, పెద్దాపురం డివిజన్

మురుగు సమస్యకు మోక్షమెప్పుడో ?



మురుగునీటితో అధ్వానంగా మారిన తుని-నర్సీపట్నం రోడ్డు



ఓ హోటల్ నుంచి తుని-నర్సీపట్నం రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

కోటనందూరు: స్థానిక పోలీసు స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ తుని-నర్సీపట్నం రోడ్డు మురుగునీటి సమస్యతో కొట్టుమిట్టాడుతోంది. ఈ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఈ రోడ్డును ఆనుకొని ఉన్న హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి వచ్చే వాడకం నీరు, ఇళ్లల్లోని మరుగుదొడ్ల నుంచి వచ్చే వ్యర్థ జలాలను రోడ్లపైకి విడిచిపెడుతున్నారు. వీరు తెలివిగా అధికారులు కళ్లు కప్పి రోజంతా నీటిని నిల్వ చేసి రాత్రి వేళల్లో రోడ్డుపైకి విడిచిపెడుతున్నారు. ఈ నీరు రోజుల తరబడి రోడ్డుపై నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన రావడంతో పాటు అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోంది. రోడ్డు అధ్వానంగా మారుతున్నా, రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నా.. హోటళ్లు, రెస్టారెంట్లు, ఇళ్ల యజమానులు మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఈ దుస్థితిపై అధికారులు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడం పట్ల ప్రజలు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా మురుగు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ముసాయిదా ఓటరు జాబితా రెడీ !

- ప్రచురించిన అధికారులు
- నియోజకవర్గంలో 2,17,459 మంది ఓటర్లు
- ఈ నెల 28 వరకూ అభ్యంతరాల స్వీకరణ

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో ఓటరు ముసాయిదా జాబితాను ప్రచురించినట్లు అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ తెలిపారు. ఈ మేరకు మండలాల వారీగా నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలను ఆమె వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక ఓటరు శిబిరాలు నిర్వహించారు. ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలు ఏఆర్వో, పోలింగ్ కేంద్రాలు, బూత్ లెవెల్ అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నెల 28వ తేదీ వరకూ అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. అలాగే 23, 24 తేదీల్లో ఓటరు నమోదు, అభ్యంతరాల స్వీకరణకు మరోసారి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారని చెప్పారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఓటరు నమోదుకు కళాశాలలు, గ్రామాల్లో ప్రత్యేక ఓటరు కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. డిసెంబర్ 24వ తేదీ లోపు క్లెయిమ్‌లను, అభ్యంతరాలను పరిష్కరిస్తామని తెలిపారు. 2025 జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, ఒక నగర పంచాయితీలో 130 లోకేషన్లలో 227 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఆమె వివరించారు.

నియోజకవర్గంలో ఓటర్లు ఇలా..

నియోజకవర్గంలో ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 2,17,459 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 1,07,289, మహిళలు 1,10,149, ఇతరులు 21 మంది ఉన్నారు. కాగా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉన్న ఓటర్ల కంటే ముసాయిదా జాబితా ప్రకటించే సమయానికి 192 మంది ఓటర్లు పెరిగారు. ఏలేశ్వరం మండలంలో 60, ఏలేశ్వరం నగర పంచాయతీలో 75, ప్రత్తిపాడు మండలంలో 37, శంఖవరం మండలంలో 68, రౌతులపూడి మండలంలో 72 మంది ఓటర్లు పెరిగారు. కాగా నియోజకవర్గంలో పురుషుల కంటే 2,860 మంది ఎక్కువగా మహిళా ఓటర్లున్నట్లు ముసాయిదా ఓటర్ల జాబితాలో వెల్లడించారు.



ముసాయిదా ఓటర్ల జాబితాను చూపుతున్న అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ సూర్యప్రభ

మండలాల వారీగా వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఏలేశ్వరం రూరల్	18,388	18,885	0	37,273
ఏలేశ్వరం పట్టణం	12,036	13,182	4	25,222
ప్రత్తిపాడు	32,552	33,027	2	65,581
శంఖవరం	22,777	23,196	12	45,985
రౌతులపూడి	21,536	21,859	3	43,398

నేడు, రేపు చీడికమ్మతల్లి జాతర



చీడికమ్మతల్లి

తుని రూరల్: మండలంలోని కేఓ మల్లవరం గ్రామ దేవత చీడికమ్మతల్లి జాతర మహోత్సవాలు రెండు రోజులు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమ, మంగళ వారాలు జాతర మహోత్సవాలను గ్రామస్తులు, వివిధ సంఘాల సహకారంతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం విఘ్నసాయి నాట్య మండలి వారితో పిశాచి సాంఘిక నాటకం ప్రదర్శించనున్నారు. మంగళవారం అందమైన జీవితం సాంఘిక నాటకం, రామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర, డీజే డ్యాన్స్ ప్రోగ్రాం, కోలాటం, బుర్రకథ, తదితర ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవార్ల శక్తి వేషాలు, బళ్ల వేషాలు, తప్పెడు గుళ్లు, చిడతలు, భజనలు, పులి వేషాలు, బాణ సంచా కాల్పుల నడుమ గ్రామంలో అమ్మవారిని ఊరేగించనున్నారు. ఇప్పటికే విద్యుత్ దీపాలంకరణలతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామ దేవత పండగ కావడంతో ఇతర ప్రాంతాల్లో ఉన్న బంధువులు, ఆడపడుచులు, అల్లుళ్ల గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

బాధితుడికి రూ.20 వేల ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన విత్తనాల ప్రసాద్ వినాయకచవితి వేడుకల్లో భాగంగా నిర్వహించిన బాణసంచా కాల్పుల్లో గాయపడ్డారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆదివారం పెద్దిపాలెంలో బాధితుడు ప్రసాద్‌ను పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రమాదానికి గల కారణాలు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మురళీరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఏ ఆపద వచ్చిన అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతల రాజు, సర్పంచులు ఏపూరి రామారావు, ఎంపీటీసీలు పిల్లా చిన్నా, అమరాధి కాశీ, పార్టీ నాయకులు గొల్లపల్లి దొరబాబు, మాకా చంటిబాబు, దేవర రమేష్, లొండ బాబు, దేవ లక్ష్మణ్, విత్తనాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ఏలేశ్వరంలో మొక్కలు నాటుతున్న పర్యావరణ పరిరక్షణ సమితి ప్రతినిధులు

ఏలేశ్వరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎస్.విజయబాబు అన్నారు. సిరి ఫుడ్స్ నిర్వాహకుడు పిచ్చెట్టి కృష్ణ జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చన్నారు. మొక్కల పెంపకాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు అనుసూరి నాగేశ్వరరావు, గోళ్ల నాగేశ్వరరావు, కోరాడ నారాయణరావు, సహదేవుడు, బుగతాశ్రీను తదితరులు పాల్గొన్నారు.

పంటకు పాలిథిన్ సంచులే రక్ష..!



ఎ.అగ్రహారంలో అడవి జంతువుల నుంచి పంటల రక్షణకు ఏర్పాటు చేసిన పాలిథిన్ సంచులు

తుని రూరల్: అడవి జంతువుల నుంచి పంటల రక్షణకు రైతులు వినూత్న పద్ధతులను అవలంబిస్తున్నారు. బొమ్మలు, పాలిథిన్ సంచులను రక్షణ కవచాలుగా ఉపయోగిస్తున్నారు. తుని మండలం ఎ.అగ్రహారం గ్రామానికి చెందిన భూముల సమీపంలో కొండలు విస్తరించి ఉన్నాయి. ఇక్కడ రైతులు ఖరీఫ్‌లో వరి, పత్తి తదితర పంటలను సాగు చేస్తున్నారు. కొండలపై నివశించే అడవి పందులు, ఇతర జంతువులు రాత్రి వేళల్లో కొండలపై నుంచి దిగువకు వచ్చి పంటలను ఆహారంగా తినడంతో పాటు ఎక్కువగా ధ్వంసం చేస్తున్నాయి. దీంతో అడవి జంతువులకు కాపలా ఉండలేక ప్రత్యామ్నాయ ఆలోచన చేశారు. ఆయా పంటలను రక్షించుకునేందుకు రైతులు వారి భూమి గట్టు సరిహద్దుల చుట్టూ ఇనుప తీగలు ఏర్పాటు చేయడం, ఐదారు అడుగుల కర్రలను నిలబెట్టి ఆ కర్రలకు పాలిథిన్ సంచులు కట్టడం ద్వారా పంటలకు రక్షణ ఏర్పాట్లు చేశారు. పాలిథిన్ సంచులు రాత్రి వేళల్లో వీచే గాలులకు అటు ఇటు ఎగురుతూ చప్పుడు చేస్తున్నాయి. దీంతో అడవి జంతువులు మనుషులు ఉన్నారనే భయంతో కొండపై నుంచి దిగువకు రావడంలేదని, ఆవిధంగా తాము పంటలను రక్షించుకుంటున్నామని రైతులు తెలిపారు. ఇలా 100 ఎకరాలకుపైగా భూములకు రైతులు పాలిథిన్ సంచులు, ఇనుప తీగలను ఏర్పాటు చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

జగ్గంపేట: మండలంలోని రామవరం రంగవల్లి నగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ చేయూతనందించారు. బాధితుడు బి.శివ కుటుంబానికి ఆదివారం బియ్యం, నిత్యావసర వస్తువులు, రూ.1500 ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి సహకారం అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

వాకర్స్ క్లబ్‌లకు అవార్డులు



అవార్డు గ్రహీతలతో వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

తుని: స్థానిక మర్చెంట్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ సమావేశం డిస్ట్రిక్ట్ గవర్నర్ చదరం శివాజీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పని చేస్తున్న 26 క్లబ్‌లు గత 10 నెలలుగా చేస్తున్న సేవా కార్యక్రమాల ఆధారంగా అవార్డులు అందజేశారు. జిల్లాలో బెస్ట్ క్లబ్‌గా రాజమహేంద్రవరం జవహర్ వాకర్స్ క్లబ్, బెస్ట్ ఉమెన్స్ క్లబ్‌గా కాకినాడ గాయత్రి వాకర్స్‌క్లబ్, బెస్ట్ ప్రెసిడెంట్ అమలాపురానికి చెందిన బోనం సత్యవరప్రసాద్, బెస్ట్ ఉమెన్ ప్రెసిడెంట్‌గా అమలాపురానికి చెందిన ఎస్.పద్మావతి అవార్డులు అందుకున్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వి.మురళీమోహన్‌రావు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో కలిదిండి సత్యనారాయణ, వాకర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారి చెంతనే వ్యర్థం.. అనర్థం



రహదారి చెంతనే పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

ఏలేశ్వరం: ఏలేశ్వరం నుంచి తిరుమాలి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా మారడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. నిత్యం రైతులు రాకపోకలు సాగించే రహదారిని అనుకుని చెత్త పేరుకుపోయింది. పట్టణశివారులో రహదారి చెంతనే చుట్టుపక్కల వారు బహిరంగ మలవిసర్జన చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు రహదారి చెంతనే ఉన్న శ్మశానవాటికలో తుప్పలు భారీగా పెరిగిపోవడంతో పాముల సంచారం ఎక్కువగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షాలు పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. చెత్త, వ్యర్థాల్లో పందులు సంచరించడంతో రైతులు అటువైపు వెళ్లేందుకు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మండల అధికారుల నంబర్లు

కిర్లంపూడి

తహసీల్దార్	– 98499 03886
ఎంపీడీఓ	– 91009 70617
ఎంఈఓ	– 90009 12335
ఎంఈఓ–2	– 98487 43433
ఏపీఓ	– 83744 46309
ఏపీఎం	– 96523 04151
ఎస్సై	– 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	– 77024 41029
వీరవరం వైద్యాధికారి	– 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	– 81066 28018
మండల వ్యవసాయాధికారి	– 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	– 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	– 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	– 89789 41840
హౌసింగ్ ఏఈ	– 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	– 97014 77778